

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ



ఎంపికైన క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జెఎన్‌టియు అనంతపురం యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా జట్టుకు నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు విజయం సాధించి జెఎన్‌టియు యూనివర్సిటీకి, తమ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తమిళనాడులోని దిండిగల్‌లో నిర్వహించనున్న బాల్ బ్యాడ్మింటన్ క్రీడలలో తమ కళాశాల విద్యార్థిరిలు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, పరిపాలన అధికారి నూకా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సైపుల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి జగన్ బస్సు యాత్ర

ఇడుపులపాయ నుంచి ప్రారంభం
ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' సభ



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రకు రంగం సిద్ధమైంది. రెండు నెలల కిందటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధం సభలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ఎన్నికల షెడ్యూలు విడుదల చేసింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వైసిపి అధ్యక్షులు జగన్ బస్సుయాత్రను వేగవంతం చేశారు. రాష్ట్రంలో సిద్ధం సభలు నిర్వహించని ప్రాంతాల మీదుగా బస్సుయాత్ర సాగించనుంది. ఈదిశగా వైసిపి నాయకత్వం రూట్‌మ్యాప్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఈనెల 27వ తేదీన జిల్లాలోని ఇడుపులపాయ నుంచి వేంపల్లి మీదుగా ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' పేరుతో భారీ బహిరంగసభ నిర్వ హించనుంది. స్థానిక వైసిపి నాయకత్వం భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లను వేగవంతం చేసింది. ప్రొద్దుటూరు వైసిపి అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి ప్రతిపక్ష టిడిపి ధీటైన అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని నియమించడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రొద్దుటూరులో భారీ బహిరంగసభ ప్రాధాన్యతను సంతరించుకుంది. సభ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో భువనేశ్వరి పర్యటన

నేడు గాలివీడు, 22న బద్వేలులో కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మూడ్రోజులపాటు కడప, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించనున్నారు. 20, 21, 22వ తేదీల్లో ఆమె పర్యటన ఖరారైంది. చంద్రబాబు అరెస్టుకు గురై జైలులో ఉండటాన్ని తట్టుకోలేక చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను 'నిజం గెలవాలి' అనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం అన్నమయ్య జిల్లాలోని గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి చెక్కులు అందజేస్తారు. మధ్యాహ్నం రాయచోటి పట్టణం రాజుల కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. అదే రోజు రాత్రికి తిరుపతిలో బస చేస్తారు. 21వ తేదీన తిరుమల దర్శనం చేసుకుని సాయంత్రానికి పోరుమామిళ్ల చేరుకుంటారు. కొత్తవీధి, బలిజకోట, చెన్నంపల్లి బాధిత కుటుంబాలను పరామర్శించి బద్వేల్‌కు వెళతారు. రాత్రికి బద్వేల్‌లోని ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో బస చేస్తారు. 22వ తేదీన బద్వేల్ పట్టణంలోని గుంతపల్లి, లింగారెడ్డిపల్లి, కలసపాడు మండలంలోని బ్రాహ్మణపల్లి, తెల్లపాడు గ్రామాల్లో పర్యటిస్తారు. బాధిత కుటుంబాలను పరామర్శించి చెక్కులు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన గూడూరుకు బయలుదేరి వెళతారు.

'నిజం గెలవాలి'ని విజయవంతం చేయండి : 'మండిపల్లి'

ప్రజాశక్తి- రాయచోటి

నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం రాయచోటి నియోజవర్గంలోని గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామం తోపాటు రాయచోటి పట్టణం రాజుల కాలనీలో పర్యటిస్తారని తెలిపారు కార్యక్రమాన్ని టిడిపి నాయకులు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సిఎఎను వ్యతిరేకిద్దాం.. దేశాన్ని కాపాడుకుందాం

- సదస్సులో వామపక్ష నేతల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర

ప్రజాశక్తి - కడప అర్బన్

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమైక్యత సమగ్రతకు నష్టం కలిగించే సిఎఎను రద్దు చేసే వరకు పోరాడాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి. చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ డబ్ల్యూ రాము, రమణయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 2019లో పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమోదింపజేసుకున్న 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఎఎ) ఆనాటి ప్రజా ఉద్యమాల ధాటికి తాత్కాలికంగా అమలు చేయలేకపోయిందని తెలిపారు. 5 సంవత్సరాల తర్వాత ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఆ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి, వైషమ్యాలు రెచ్చగొట్టి, మతకలహాలు సృష్టించి అధికారమే ధ్యేయంగా హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు, నరమేధానికి తెగబడుతుందని ఆరోపించారు. బిజెపి హిందూత్వ వ్యవస్థను ఏర్పాటు చేయడానికే ఈ ప్రయత్నమని తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగం మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 16, 25లను ఉల్లంఘిస్తుందని చెప్పారు. ముస్లిములు అధికంగా ఉన్న పొరుగు దేశాలలో పీడనకు గురవుతూ, శరణార్థులుగా వచ్చిన వారిని కాపాడేందుకు ఈ చట్టం తెచ్చామని ప్రజల్ని నమ్మించే ప్రయతం చేస్తున్నారని చెప్పారు. ఇది ఎంతమాత్రం నిజంకాదని తెలిపారు. మరి శ్రీలంక, బూటాన్, మయన్మార్‌లో పీడనకు గురవుతూ శరణార్థులుగా వస్తున్న వారికి ఎందుకు రక్షణ కల్పించటంలేదని ప్రశ్నించారు. రక్షణ కల్పించటం కొందరికి మాత్రమే వర్తించే సూత్రం అవుతుందా అని ప్రశ్నించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వటం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతని పేర్కొన్నారు. ఈ దేశంలో నివసిస్తున్న హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు, సిక్కులు ఇలా అన్ని మతాలవారూ భారతీయులే అన్నారు. ఈ దేశ ప్రజల మధ్య చీలికలు తెచ్చి భారతదేశ విచ్ఛిన్నానికి, వినాశనానికి ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌కు వ్యతిరేకంగా దేశ సమగ్రతను కాపాడుకుంటూ, రాజ్యాంగ పరిరక్షణకోసం ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు ఎన్.వెంకట శివ, రామ్మోహన్,సుబ్రహ్మణ్యం, వీరశేఖర్, అన్వేష్, కే.సీ.బాదుల్లా, బి.మనోహర్, శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, గంగా సురేష్, శివకుమార్, వలరాజు, చిన్ని, మునయ్య, భాగ్యలక్ష్మి, శంకర్ నాయక్, శివశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి : టిడిపి

ప్రజాశక్తి-పీలేరు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరైన ప్రజాగళం సభలో చోటు చేసుకున్న భద్రతా వైఫల్యంపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని పీలేరు టిడిపి నాయకులు విజ్ఞప్తి చేసుకున్నారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం చిలకలూరిపేట సమీపంలోని బొప్పాడిలో జరిగిన ప్రజాగళం సభ భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నాతాధికారులపై తగిన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది జనం సభ వైపుకు తోసుకు వస్తుంటే నియంత్రించాల్సిన బాధ్యత కలిగిన పోలీసులు చోద్యం చూస్తూ నిలబడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ కన్వీనర్ వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మండల టిడిపి యువ నాయకులు పసుపులేటి లక్షీకర, ప్రచార కార్యదర్శి పోలిశెట్టి సురేంద్ర, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డి బాష, పురం రామ్మూర్తి, శ్రీనాథ్‌రెడ్డి, వసంతాల రాజా పాల్గొన్నారు.

వివరాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో హెల్త్ ప్రొవైడర్ల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని ప్రయివేట్ ఆస్పత్రులు, క్లినిక్స్ , ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్స్, డెంటల్, ఆప్తల్మిక్ క్లినిక్స్, ఫిషియోథెరపి సెంటర్స్ మొదలగు కేంద్రాలలో అందించె సేవలు వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను, 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్' కార్యక్రమంలో భాగంగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకొని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వివరాలను, https//// hprid. abdm.gov.in, https////facilitye.abdm.gov.in వెబ్ సైట్లలో తప్పనిసరిగా, వ్యక్తిగత స్టాఫ్ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

ఎల్ఎల్‌బి పరీక్షల నిర్వహణలో మార్పు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 23న జరగాల్సిన 3,5 సంవత్సరానికి చెందిన లా పరీక్షలు 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ మార్పు చేశామని, విద్యార్థుల గమనించాలి తెలిపారు. మిగిలిన పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-రాయచోటి: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్ (30 రోజులు)లపై గ్రామీణ మహిళలకు ఈ నెల 20 నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి నుంచి 45 ఏళ్ల వయస్సున్న గ్రామీణ నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఈ శిక్షణ తరగతులలో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చు వారికి ఉచిత వసతి మరియు భోజన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన నిరుద్యోగ మహిళలు ఈ ఉచిత శిక్షణ తరగతుల కొరకు తమ యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో కడపలో ఉన్న కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 9440905478, 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమాలని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా ప్రభుత్వ, ప్రయివేటు భవనాలు, వాణిజ్య స్థలాల్లో రాజకీయ ప్రకటనలు, గోడ రాతలు, జెండాలు, పోస్టర్లు, పెద్ద పెద్ద హోర్డింగ్స్, కటౌట్స్ తొలగింపులకు తీసుకోవాల్సిన చర్యలు, స్టాటిక్ సర్వైవలెన్స్ టీమ్‌ల పనితీరు, పోలింగ్ పర్సన్స్ రాండమైజేషన్, డ్రై రన్, ప్రథమ శిక్షణ, ఇవిఎంల మొదటి, రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ, సి విజిల్ యాప్ ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలలో జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు అంశాలలో దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఐఒసత్యనారాయణ రావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున నూతన అనుమతులను ఏమాత్రం ఇవ్వరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని బోర్డర్ చెక్ పోస్ట్‌ల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా తగు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపరచడం, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంను విస్తృత స్థాయిలో వినియోగించాలని చెప్పారు. సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణం స్పందించి సకాలంలో పరిష్కరించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పట్టని ఆర్‌టిసి

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌టిసి యాజమాన్యం ఎన్నికల నియమావళి అమలు చేయడంలో విఫలమైంది. పీలేరు బస్టాండు పరిసరాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రచార గోడ పత్రికలు, ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నా అవి వారి దృష్టిన పడలేదు. సరి కదా కనీసం బస్టాండ్ పరిసరాలను పరిశీలించి, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏవైనా రాజకీయ ప్రచార సామగ్రి ఉందా అనే అంశాన్ని పట్టించుకోలేదనే తెలుస్తోంది. పోనీ వాటిని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్న కనీస ఆలోచన కూడా సంబంధిత అధికారులకు రాలేదనే తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి మూడు రోజులు దాటినా పీలేరు పట్టణంలో కొన్ని నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సామగ్రిని పూర్తిగా తొలగించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. బస్టాండ్ పరిసరాల్లోని వాణిజ్య సముదాయాల ముందు, వారపు సంత ప్రహరిపై ప్రచార గోడ పత్రికలు, ఫ్లెక్సీ చూపరుల దృష్టిని తాకుతున్నాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం స్థానికంగా పలు విమర్శలకు దారి తీస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాటి తొలగింపు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం

- ఎఒకు ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు వినతి



ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేకోడూరులో జరుగుతున్న మాస్ కాపీయింగ్‌పై మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయంలోని ఎఒ సత్యానంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు బయట వ్యక్తులను ప్రోత్సహించి 100 శాతం ఉత్తీర్ణత తెప్పించి విద్యను వ్యాపారం చేయడం కోసం ఇతర విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులు పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పడం అవాస్తమన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం లేదని తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని అధికారికంగా విచారించి తక్షణమే మార్పు చేయాలని, ఈ చర్యలకు పాల్పడిన వారిపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ఆకేపాటి శివతేజ, కొప్పల కార్తిక్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగిన వారికే అవకాశం ఇవ్వాలి

- ప్రముఖ న్యాయవాది జల్లి నారాయణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సామాజిక స్పృహ కలిగి, సేవా భావం కల వారికే రైల్వేకోడూరు టిడిపి అభ్యర్థిగా అవకాశం కల్పించాలని సీనియర్ న్యాయవాది జల్లి నారాయణ తెలియజేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో భ్రష్టు పట్టిన అవినీతి రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, కేవలం ధనమే రాజకీయాలను శాసిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాస్ జనచైతన్య సేవాసమితి ద్వారా ఎంతో కాలంగా ప్రజా సేవ చేస్తున్నానని, సీనియర్ న్యాయవాదిగా అనేక మందికి న్యాయ సలహాలు ఇవ్వడమే కాక అండగా నిలబడి సేవలందించానని పేర్కొన్నారు. పుల్లంపేట మండలం, వత్తలూరు గొల్లవారిపల్లెకు చెందిన తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, తనకు కుటుంబ విలువలు, పేదరికం, సమాజ స్పృహ పట్ల లోతైన అవగాహన ఉందని తెలిపారు. తనకు టిడిపి నుంచి రైల్వేకోడూరు టికెట్ కేటాయిస్తే ప్రతి మండలంలోనూ బంధు, మిత్ర బలం సంపూర్ణంగా ఉండటం వలన టిడిపిని గెలిపించుకోగల సత్తా ఉందని పేర్కొన్నారు. నారాయణ నాయుడు హయాంలో తెలుగుదేశం పార్టీకి రైల్వేకోడూరు కంచుకోటలా ఉందో తిరిగి అదే పూర్వవైభవాన్ని తీసుకొస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. సేవా తత్పరుడిగా పేరుగాంచి రాజకీయాలకు సరికొత్త నిర్వచనం తెలిపిన తన తాత ఐన కవి రాజా బిరుదాంకితుడు, రైల్వేకోడూరు మొట్టమొదటి శాసనసభ్యులు డాక్టర్ బాల వెంకటసుబ్బయ్య స్ఫూర్తితో రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తూ శేష జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తన కుటుంబంలో కమ్మ, రెడ్డి, వడ్డెర కులాలకు చెందిన కుటుంబ సభ్యులు ఉన్నారని, ఆది నుంచి కుల, మతాలకతీతంగా ఉంటూ కేవలం మానవతావాదులుగా నడుచుకుంటున్నామని పేర్కొన్నారు. తనకు నియోజకవర్గంలో టిడిపి అధిష్టానం అవకాశం కల్పిస్తే గెలుపు జెండా ఎగురవేసి కుల, మత, వర్గాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలియజేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



వీధుల్లో పర్యటిస్తున్న కమిషనర్ వాసుబాబు

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజారోగ్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో, వీధుల్లో పర్యటించి ప్రధాన సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల భాద్యతలు తీసుకున్న ఆయన పట్టణం పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ సహకరించాలని పిలునిచ్చారు. చెత్తను రోడ్లపై, ఖాళీ ప్రాంతాల్లో, మురుగు కాలువల్లో పారావేయరాదని, మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందివ్వాలని సూచించారు.మార్కెట్, బండ్లపెంట, పాత రాయచోటి, బ్రాహ్మణ వీధి, నాయబ్ సాబ్ వీధులలో కొనసాగుతున్న పారిశుధ్య పనులు ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా 'సుగవాసి'

ప్రజాశక్తి - రాయచోటి



టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు రాయచోటి నియోజవర్గంలో టిడిపి అభ్యర్థుల విజయంతో పాటు జడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి నిరంతరం కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్నానని చెప్పారు. తనపై ఉన్న నమ్మకంతో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిగా నియమించేందుకు సహకరించిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, రాజంపేట పార్లమెంట్, రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి నేతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే కాకుండా రాజంపేట పార్లమెంట్, రాయచోటి నియోజవర్గ టిడిపి అభ్యర్థుల విజయానికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్ బుధవారం (సా)	షహరీ గురువారం (ఉ)
6.30	5.05

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్‌లో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం వారు కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాంను విద్యార్థులకు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్.యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలోస్మార్ట్ బ్రిడ్జ్ కంపెనీ డైరెక్టర్ యుక్తేష్ చింతమడక పాల్గొని మాట్లాడుతూ మంచి ఉద్యోగంలో చేరాలంటే కష్టపడాలి అని, అందుకోసం విద్యార్థులకు ముందస్తు ప్లానింగ్ ఎంతో అవసరమన్నారు. అవకాశాలు వచ్చే వరకూ వేచి ఉండకుండా మంచి అవకాశాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగాలు దొరకడమంటే ఆషామాషీ కాదని పేర్కొన్నారు. అందులోనూ ఇప్పుడు ప్రతి రంగంలోనూ తీవ్రమైన పోటీ పరిస్థితులు నెలకొన్నాయనే విషయాన్నీ మరవదద్దని తెలిపారు. కళాశాలలో జరిగే రకరకాల సాంస్కృతిక, విజ్ఞాన కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. ఇవి కూడా కెరీర్‌లో ఎంతో ప్లస్ పాయింట్ అవుతాయన్నారు. స్వచ్ఛందంగా సమాజ సేవ చేయడం వంటివి మీ రెస్యూమేకి అదనపు అర్హతలుగా పరిగణించబడతాయన్నారు. రకరకాల కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం వల్ల వర్క్‌ప్లేస్ స్కిల్స్‌ను కూడా పెంచుకోగలుగుతారని పేర్కొన్నారు. కెరీర్ పరంగా వచ్చిన ఏ అవకాశాన్నీ విద్యార్థులు వదలుకోకుండా ఉపయోగించుకోవాలని చెప్పారు. తరచూ జరిగే గెస్ట్ లెక్చర్లను మిస్ అవదద్దని, వాటి నుంచి సబ్జక్టు పరంగా మీ అనుమానాలను నిర్వీర్యం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీల్లో అనేక కొలువు ఉన్నాయని, క్యాంపస్ రిక్రూట్‌మెంట్లో నెగ్గితే ఉజ్వల కెరీర్‌కు తొలి అడుగు అని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి పర్సంటేజీ సొంతం చేసుకుంటే మెరుగైన ప్యాకేజీ గ్యారెంటీ అని, ఏటా లక్షల మంది బీటెక్ వైపు అడుగులు వేయడానికి కారణాలివేనని పేర్కొన్నారు. నూతన టెక్నాలజీలపై అరుదైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కుసుమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ యుక్తేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నూర్జహాన్

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పోషణ పక్వాడలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం ప్రాజెక్ట్ లెవల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ కె.భాగ్యమ్మ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, మిల్లెట్ వంటలు పోషకాహారాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లులు, పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. బి.పి, షుగర్ లాంటి వ్యాధులు రావని తెలియజేశారు. అనంతరం ఎంపిడిఒ నూర్జహాన్ మాట్లాడుతూ మిల్లెట్స్, మొలకెత్తిన గింజలు, ఆకుకూరలు, ఐరన్ వున్న ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిదని తెలియజేశారు. వెల్ బేబీ షో నిర్వహించి అంగన్వాడీ కార్యకర్తలు ప్రతినెల బరువు, ఎత్తు, ఆహారం ఇస్తూ సలహా, సంప్రదింపులు తీసుకొని, బిడ్డలను ఆరోగ్యంగా చూసుకున్న మూడు నెలల చిన్నారుల తల్లులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు బి.మంజుల, జి.హిజాద్ ప్యారీ, ఇ.గౌరీదేవి, జి.జయరాణి, కె.భవాని, నాగరత్నమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి మండలంలో స్థానిక జడ్పిహెచ్ఎస్ హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఎస్ఐ హుస్సేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎవరైన అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి-ములకలచెరువు

యువతను, నిరుద్యోగులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలపాటు అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం, ఐదు సంవత్సరాల పాటు అధికారంలో వున్న వైసిపి ప్రభుత్వం యువతకు, నిరుద్యోగులకు చేసింది ఏమీ లేదని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారాన్ని కైవసం చేసుకున్న తర్వాత మోడీ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ప్రతి యేటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని గొప్పలు చెప్పి అధికారంలో కొచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. ములకలచెరువు మండల యువజన సమాఖ్య కన్వీనర్ గా ఎంపికైనట్లు కాలేషా తెలియజేశారు. ఈ ప్రభుత్వాలు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అంజినప్ప, టౌన్ కార్యదర్శి ఆనంద్, పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు కృషి చేయండి

ప్రజాశక్తి-చిన్నమండెం

టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దిగువగొట్టివీడు గ్రామంలో, జంగంపల్లి, కొత్తపల్లి, దళి తవాద, రామాపురం, ముండ్లవారిపల్లి, గుట్టకింద పల్లె, దిన్నెమీద పల్లె గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిసతీమణి హరిత రెడ్డి. శ్రీలతరెడ్డి, విద్యా రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి ప్రతాప్ నాయుడు, మాజీ ఎంపిటిసి నాగేశ్వర, దేవ గోపాల్ నాయుడు, మద్దిరాల అనిల్ కుమార్, బొజ్జ రమణ, బొజ్జ చిన్న, నాగేంద్ర నాయుడు, రామలక్ష్మణ, హనుమంతనాయుడు, వేణు, అశోక్, సిద్ధయ్య, బిసి నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని దీపా బ్లడ్ బ్యాంక్‌లో ప్రముఖ సంఘ సేవకులు బ్లడ్ ఇవ్వ ప్రమోటర్ సయ్యద్ మైనుద్దీన్, పదిలం శివ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేయడానికి మండిపల్లి సోదరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త దానం ప్రాణ దానంతో సమానమని, రోగి ప్రాణాలు కాపాడుకోవచ్చని అన్నారు. మనం రక్తదానం చేస్తున్నామంటే మరో మనిషి ప్రాణాలను కాపాడిన వారమవుతామని పేర్కొన్నారు. రక్తదానం చేసేందుకు యువత పెద్ద ఎత్తున తరలి రావడం సంతోషకరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో బిందురెడ్డి, జయరామ్‌రెడ్డి, శివారెడ్డి, దేవా, చిన్న, పదిలం శివా, కొండా రెడ్డి, నంద యాదవ్, మద్దిరాల అనిల్, అలాగే మండిపల్లె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** స్థానిక నలందనగర్ స్టేట్ బ్యాంక్ దగ్గర మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, కాంటాక్ట్ రాజు, చెంచర్ల ఆంజనేయులు, జెకె టైలర్, మధుసూదన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి పునాది : ఆర్‌డిఒ



మదనపల్లి: జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-మదనపల్లి

ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదని వయోజనులు ఓటర్లుగా మారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్ కోరారు. మునిసిపల్ కమిషనర్ ప్రమీల, తహశీల్దార్ రమాదేవి తదితరులు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌డిఒ హరిప్రసాద్ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలకు ఓటుహక్కుపై చైతన్యం కలిగిస్తున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వయోజనులు, ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. **వీరబల్లి:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని దేశ, రాష్ట్ర, భవిష్యత్తును నిర్ణయించే ఈ హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఓటు హక్కు అవగాహన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల మంచి పాలకులను ఎంచుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఏపిఎం భాదరవల్లి, సిసిలు, సంఘాల లీడర్లు, వెలుగు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ, వెలుగు మండల సమాఖ్య ఏపిఎం లక్ష్మణరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు మండల సమైక్య కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై ఐసిడిఎస్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, సంఘమిత్రలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఓటు వంతు పాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎస్.పి. స్వరూప, పి.స్వర్ణ, ఎం.ఉమ, కె.అక్కయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, మండల సమైక్య సిబ్బంది, సంఘమిత్రలు, రైతు భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శివరాముడు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అధ్యక్షతన కోడూరు మండల వెలుగు సిబ్బందికి, స్వయం సహాయక సభ్యులకు, అంగన్వాడీ కార్యకర్తలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం టోల్‌గేట్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, స్వయం సహాయక సభ్యులు అధికారులు పాల్గొన్నారు. **సుండుపల్లి:** తహశీల్దార్ ఆధ్వర్యంలో ఓటు–నా హక్కులి అనే నినాదంతో నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పోలీసు సిబ్బంది, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ,విఆర్ఓలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని స్థానిక మండల వెలుగు కార్యాలయంలో మండల అధికారులు ఓటు హక్కు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పుణ్యవతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి భాగ్యమ్మ, మహిళా మండల సమాఖ్య నాయకురాలు మాట్లాడుతూ ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ పుణ్యవతి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి భాగ్యమ్మ,వెలుగు మండల మహిళా నాయకురాలు, మహిళ సంఘాల సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు రాజన్న, దేగానిపల్లి మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. **కలకడ:** ఓటు హక్కును వినియోగించుకోవడంపై అవగాహన కల్పించి నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రాన్ని కలగడ మండల సమైక్య కార్యాలయంలో సంఘమిత్రులు, అంగన్వాడీ వర్కర్లకు సమావేశం నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలకడ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, ఎపిఎం రమేష్, అంగన్వాడీ సూపర్వైజర్లు సంఘ మిత్రులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏరియా కోఆర్డినేటర్ రూతు అన్నారు. ఎంఎస్ఇసి, విఒఎ, ఎడబ్ల్యూడబ్ల్యూ లకు ఓటు హక్కు పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలి అని భాధ్యత గల ప్రతీ పౌరుడు, పౌరురాలు తప్పక ఓటు వేయాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్క పౌరుడు ఓటు సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అది కారులు ఎపిఒ సుజాత, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుం ధతి, సర్తాజ్, సిసిలు చంద్రకళ, బాబా సాహెబ్, ప్రభా కర్, ఆంజనేయులు, ఏకాంబరం, విఒఎలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం లక్కిరెడ్డిపల్లి తహశీల్దార్ రాయచోటి నియోజకవర్గం నోడల్ ఆఫీ సర్ కుమార్ స్వామి కొత్త ఓట్లు నమూనా కార్యక్రమం పైన అవగాహన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మే 13వ తేదీకి ఎన్నికలు నిర్ణయించడంతో కొత్త ఓటు నమోదుకు మరోసారి చివరి అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్ ఆదేశం ప్రకారం ఏప్రిల్ 15వ తేదీలోగా 18 ఏళ్ల వయసు నిండిన వారికి కొత్త ఓటు నమోదుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.వయోజనులు ఓటు నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రెడ్డన్న, ఆర్ఐ సంపత్‌కుమార్, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.



సుండుపల్లి: మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు



కలకడ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పార్టీ ఆదేశాలకు కట్టుబడకపోతే వేటు తప్పదు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అన్ని రకాల సర్వేలు నిర్వహించి జయచంద్ర రెడ్డి నాయకత్వాన్ని బలపరిచారని తంబళ్లపల్లెలో ఆయన గెలుపుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని అలా కాకుండా కొందరు అసత్య ప్రచారాలు, సమస్యలు సృష్టిస్తే ఖచ్చితంగా వేటు తప్పదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ములకలచెరువ టిడిపి కార్యాలయంలో ఆరు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తంబళ్లపల్లి నియోజకవర్గం లో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి గెలుపు కోసం మండలాల నాయకులు ప్రణాళిక బద్ధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అధినేత చంద్రబాబు ఆదేశాలతో మేనిఫెస్టో లోని సూపర్ సెక్స్ పథకాలతో పాటు వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లుగా చేసిన అరాచకం, దౌర్జన్యాలు, భూ దోపిడి, మాఫియాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగేలా ప్రతి గడపకు చేరవేయాలి అన్నారు. మండలాల పరిధిలోని నాయకులు భవిష్యత్తులో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను కూలంకషంగా విశదీకరిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పోలింగ్ బూత్ కమిటీలు కీలకంగా పనిచేయాల్సి ఉంటుందని వారి సేవలను స్థానికంగా గల నాయకులు సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఎన్నికల ప్రచారంలో మన మిత్ర పక్షాలైన జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు లను కలుపుకొని మారుమూల గ్రామాలలో ప్రచారం ఉధృతం చేయాలని ఉత్తేజపరిచారు. రాబోయేది టిడిపి, జనసేన, బిజెపి, ఉమ్మడి ప్రభుత్వమేనని నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. ప్రతిరోజు మండల స్థాయి నుండి జరిగిన ప్రచార కార్యక్రమాల వివరాలను కేంద్ర పార్టీ కార్యాలయానికి వివరాలు అందేలా చూడాలని ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎప్పటికప్పుడు తంబళ్లపల్లె టిడిపి అభ్యర్థి జయచంద్ర రెడ్డి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టిడిపి అభ్యర్థి జయచంద్ర రెడ్డిని పార్లమెంటు కార్యదర్శి పూస చంద్రమోహన్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి షేక్ అయూబ్, మాజీ ఎంపిటిసి ఎన్.వి. రమణారెడ్డి, విశ్వనాథరెడ్డి, ఎస్ విశ్వనాథరెడ్డి, వసంత రెడ్డి ఆరు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, కార్యనిర్వాహక సభ్యులు, సీనియర్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా..తొలగని పోస్టర్లు

- చర్యలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-పుల్లంపేట

దేశవ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి 72 గంటలు దాటినా పుల్లం పేట మండల పరిధిలో దాని ఆనవాళ్లు కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. నిబంధనల ప్రకారం తొలగించాల్సిన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సామాగ్రిని పూర్తిగా తొలగించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. మండల పరిధిలోని కడప–చెన్నై హైవే వద్ద ఆదర్శ పాఠశాల ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ గోడల మీద టిడిపి పోస్టర్‌లు దర్శనమిస్తున్నా తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలకు దారితీస్తుంది. ఎన్నికల ప్రచార సాధనాలు, రాజకీయ పార్టీ నేతల ఫోటోలతో ఏర్పాటు చేసిన కటౌట్లు, బోర్డులను ప్రధాన ప్రాంతాల్లో తొలగించారే తప్ప మారుమూల ప్రాంతాల్లో వాటిని తొలగించడానికి తగిన శ్రద్ధ చూపలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రాజకీయ నాయకుల బ్యానర్లు, పోస్టర్లను తొలగించాలని కోరుతున్నారు.



గోడలపై తొలగని పోస్టర్లు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సార్వత్రిక ఎన్నికలు జరగనున్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం స్థానిక ఎస్ఐ లోకేష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం చేసిన అగ్రహారం, సామకోటవారిపల్లె, వెంగంవారిపల్లె, బాలినాయునిపల్లె, మండ్యంవారి పల్లెలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటానికి తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని అన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కు ను నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

నాటుసారా తాగి నీటిలో పడ్డ వ్యక్తి

ప్రాణాలను రక్షించిన స్థానికులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా తాగి బహుదానది నీటిలో ఓ వ్యక్తి పడిన సంఘటన మంగళవారం ఉదయం మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అగ్రహారం పంచాయతీ బండ మీదపల్లెకు చెందిన ఐ.రెడ్డప్ప వ్యవసాయం చేసుకుంటూ, పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. అగ్రహారం గ్రామంలో నాటుసారా యధేచ్ఛగా దొరుకుతుండడంతో రెడ్డప్ప సారాకు అలవాటుపడ్డారని చెప్పారు. చింతపర్తివారి పల్లెలో నాటు సారాను తాగి తిరిగి ఇంటికి వస్తు బహుదానదిని దాటే క్రమంలో సారా మత్తు కారణంగా నీటిలో పడిపోయారని అన్నారు. ఉదయం కాలకృత్యాల కోసం నది దగ్గరకు వెళ్లిన ఓ వ్యక్తి రెడ్డప్ప నీటిలో పడి ఉండటానికి గమనించి హుటాహుటిన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించి, అతనిని నీటిలో నుంచి బయటకు తీశారని తెలిపారు. ప్రథమ చికిత్సలు చేసి 108 వాహనంలో రెడ్డప్పను మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి, చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. అగ్రహారం గ్రామంలోని చింతపర్తి వారిపల్లి, చెరువుముందర పల్లిలో నాటు సారా విక్రయాలు యదేచ్ఛగా జరుగుతున్నాయని స్థానికలు పేర్కొన్నారు. నాటుసారా అందుబాటులో ఉండటంతో ప్రజలు సారాను తాగి జీవితాలను, కుటుంబాన్ని నాశనం చేసుకుం టున్నారని అన్నారు. నాటుసారా తయారీపై నిఘాను పటిష్ట పరచాలని కోరారు. సారా తయారు చేసే వారిపై, విక్రయించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మద్యం మత్తులో పడిన రెడ్డెప్ప

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

గాలివీడు : పల్లెల్లో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ట్యాంకర్ల ద్వారా నీరు తోలే అవకాశాలు లేనందున నీటిపైప్‌ల ద్వారా అందించే ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించాలి

ముద్దనూరు :మహిళల, పిల్లల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం సిడిపిఒ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పథక సంచాలకులు శ్రీలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను సందర్శించారు. అనంతరం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బేటీ బచావో–బేటీ పడావో గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, సూపర్‌వైజర్లు భారతి, ఉమారాణి, ప్రవీణ కుమారి, బ్లాక్ కో–అర్డినేటర్ జోగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మండ్లి సుబ్బమ్మ నేత్రదానం

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

స్థానిక ప్రశాంతినగర్‌కు చెందిన మండ్లి సుబ్బమ్మ (80) మంగళవారం మరణించడంతో ఆమె మనవడు కాశీవిశ్వనాథ్, మనవరాలు పార్వతమ్మ, నాగ మల్లీశ్వరి, లక్ష్మీదేవి నేత్ర దానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి ఆయన మృతురాలి ఇంటికెళ్లి పార్థీవదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను బంధువులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్



ద్విచక్ర వాహనాల దొంగలు, వాహనాలను చూపుతున్న సిఐ యువరాజ్

బైక్‌ల చోరీ ముఠా అరెస్టు

రూ.8 లక్షల విలువైన 6 బైక్‌లు సీజ్ : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లి

రాయల్ ఎన్ఫీల్డ్ (బుల్లెట్ బైకులను) చోరీ చేస్తున్న దొంగల ముఠాను మదనపల్లె పోలీసులు అరెస్టు చేశారు. దొంగల ముఠా అరెస్టుకు సంబంధించి మదనపల్లి రెండవ పట్టణ సిఐ యువరాజు, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, ఇనయతుల్లా మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాల వెల్లడించారు. మదనపల్లిలో ఈ నెల 4న బుల్లెట్ బైక్ చోరిపై ఫిర్యాదు అందిందన్నారు. వెంటనే స్పందించి కేసు నమోదు చేసి నాలుగు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలోనే నిందితులు పలమనేరుకు చెందిన స్కూటర్ మెకానిక్ జావీద్, ముజంబల్, పటాన్ ఇర్ఫాన్ ఖాన్, అక్బర్ హుస్సేన్, తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్ద తిప్ప సముద్రానికి చెందిన బాలు(21) అనే ముఠాలోని ఐదుగురు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి పలమనేరు, మదనపల్లి ప్రాంతాలలో బుల్లెట్ బైక్ లను దొంగలించి తీసుకెళ్లి పొరుగు జిల్లాలలో విక్రయించే వారని అన్నారు. దొంగలించిన బైకులను విక్రయించ డానికి మదనపల్లి పట్టణం కదిరి–చిత్తూరు జాతీయ రహదారి లోని ఇసుక నూతిపల్లి వద్ద దొంగల ముఠా బైకులతో ఉన్నట్లు అందిన పక్కా సమాచారంతో వెంటనే వెళ్లి నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన దొంగల ముఠా దగ్గర నుంచి సుమారు రూ.8లక్షలకు పైగా ఖరీదైన ఆరు బైక్ లను (1బుల్లెట్,2స్పెండర్ ప్లస్,1 హొండా అక్టీవ్, హోండా డియో) వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి బైక్‌లు సీజ్ చేశా మన్నారు. పట్టుబడిన వారిని విచారించి నిందితులు నేరం అంగీకరించడంతో అరెస్టు చేశామని తెలిపారు. వీరంతా జల్సాలకు అలవాటు పడి చిన్న వయసులోనే దొంగతనాలు చేస్తున్నారని తల్లిదండ్రులు పిల్లల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఇదిలా ఉండగా నిందితులను పట్టుకోవడానికి ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, ఇనయతుల్లా లతో పాటు సిబ్బంది శంకర్, ప్రసాద్, భద్ర, శివ ను అభినందించినట్లు సిఐ యువరాజు తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్లు..

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నిమ్మనపల్లి పంచాయతీ మద్దిరెడ్డిగారి పల్లి (గూడుపల్లి) సమీపంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమా చారం అందడంతో పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశామని చెప్పారు. దాడిలో నలుగురు జూద మాడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.4,050లు నగదు స్వాధీనం చేసుకొని, 52 పేక ముక్కలను సిజ్ చేసినట్లు తెలిపారు. నింది తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ శివరా మకృష్ణయ్య, కానిస్టేబుల్ రాజేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు అయిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు..మొలకలచెరువు మండలం, బురకాయలకోట పంచాయతీ, పలక వారిపల్లి చెందిన జస్వంత్‌రెడ్డి ఇంటర్మీడియట్ చదువుతున్నాడని చెప్పారు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి తిరిగి మళ్ళీ స్వగ్రామానికి వెళుతుండగా సెంట్రల్ సమీపంలో జశ్వంత్ ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో జస్వంత్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కట్టుకున్న భార్యపై అనుమానం పెంచుకొని హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు లక్కిరెడ్డిపల్లి సిఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని కుర్నూతల, బొమ్మేపల్లి గ్రామానికి చెందిన బొమ్మే పల్లి యోగానందరెడ్డి భార్యాభర్తలు తరచూ గొడవపడే వారిని భార్యపై అను మానం పెంచుకొని ఆదివారం తెల్లవారుజామున చున్నీతో గొంతు బిగించి హత్య చేశాడని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిఐ తెలి పారు. సమావేశంలో ఎస్ఐ విష్ణువర్ధన్, కోర్ట్ కానిస్టేబుల్ గంగరాజు పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు